సాక్షి విశాఖపట్నం

శనివారం । 16 । డిసెంబర్ । 2023



'దేశీ' ఉత్పత్తులే దివ్యౌషధాలు

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికగా జరుగుతున్న విశాఖ ఆర్గానిక్ **మేళాకు విశేష స్పందన** లభిస్తోంది. 8లో



త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు

తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీక అమర జీవి పొట్టి శ్రీరాములు అని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. 8లో



ధైర్యం కోల్పోవద్దు 8లో

సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యం కోల్పోవద్దని ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు.

మెట్రో... రైట్ రైట్...!





మెట్రో రైల్ ప్రాజెక్టు నమూనా

- లైట్ మెట్రో డీపీఆర్‌కు కేబినెట్ ఆమోదముద్ర
- 76.90 కి.మీ. లైట్ మెట్రో నిర్మాణానికి ప్రణాళికలు
- తొలివిడతలో 46.23 కిమీ 42 మెట్రో స్టేషన్లతో కూడిన 3 కారిడార్ల నిర్మాణం
- ఫస్ట్ ఫేజ్ నిర్మాణానికి రూ.9,699 కోట్ల అంచనా వ్యయం
- ఫేజ్–2లో రూ.4,610 కోట్లతో 12 స్టేషన్లతో కారిడార్–4 నిర్మాణం
- పనులు దక్కించుకున్న మూడేళ్లలోనే తొలి రైలు పరుగు
- అనంతరం మోడ్రన్ ట్రామ్ ప్రాజెక్టుకు శ్రీకారం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

ప్రథమ శ్రేణి నగరాలతో పోటీపడుతూ మహా విశాఖ మరింత అభివృద్ధి చెందేందుకు అవసరమైన మెట్రో రైలు ప్రాజెక్టుకు రాష్ట్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రజారవాణా వ్యవస్థను పటిష్టం చేసేలా రూపొందించిన లైట్ మెట్రో రైలు ప్రాజెక్టు



పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)కు ఆమోదం తెలిపింది. మొత్తంగా రూ.14,309 కోట్లతో 76.90 కిమీ మేర లైట్‌మెట్రో నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో తొలి విడతలో రూ.9,699 కోట్లతో 46.23 కిమీ, ఫేజ్–2లో రూ.4,610 కోట్లతో నాలుగో కారిడార్ నిర్మాణ పనులు నిర్వహించేందుకు కేబినెట్ ఆమోదించింది. ఈ పనులకు సమాంతరంగా మోడ్రన్ ట్రామ్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన డీపీఆర్‌కు ఇంకా ఆమోదం తెలపాల్సి ఉంది. లైట్ మెట్రో డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి పంపించే ఏర్పాట్లలో ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ అధికారులు నిమగ్నమయ్యారు.

నగర అవసరాలకు అనుగుణంగా..

2021 అంచనాల ప్రకారం విశాఖ మహా నగరంలో **25 లక్షలకు పైగా జనం ఉన్నా**రు. మెట్రో ప్రపో**జల్స్ ఉన్న శివారు ప్రాంతాల్లో** కలిపి 41 లక్షల **వరకూ జనాభా ఉంటారు.** అందుకే తప్పనిసరిగా మెట్రో అవసరం. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. లాభనష్టాలతో సంబంధం లేకుండా కేవలం ప్రజలకు రవాణా సౌకర్యాలు భవిష్యత్తులు మెరుగుపరిచేందుకు మెట్రోపై దృష్టి సారించింది. మెట్రో రైలు రాకతో ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. ఒక మెట్రో రైలు వెళ్తే 8 బస్సులు వెళ్లినట్లు సమానం. ఒకసారి వెళ్లే మెట్రోలో 400 మంది ప్రయాణించగలరు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో లైట్‌మెట్రో ప్రాజెక్టు డీపీఆర్‌కు ఆమోదం తెలిపారు. 76.90 కిమీ మేర లైట్‌మెట్రో ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. హెవీ మెట్రోతో పోల్చి చూస్తే లైట్ మెట్రో ద్వారా నిర్మాణ వ్యయంలో 20 శాతం, వార్షిక నిర్వహణలో 15 శాతం భారం తగ్గనున్న కారణంగా రాష్ట్ర ప్రభుత్వం లైట్ మెట్రోవైపే మొగ్గు చూపింది.

ఎనిమిదేళ్లలో పూర్తి

పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో విశాఖ మెట్రో ప్రాజెక్టు నిర్మించాలని కేబినెట్ నిర్ణయించింది. మొత్తం ప్రాజెక్టు విలువ రూ.14,309 కోట్లు అవుతుందని డీపీఆర్‌లో పొందుపరిచారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 20 శాతం అంటే రూ.2861.8 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం అంటే రూ.2861.8 కోట్లు వెచ్చించనున్నాయి. మిగిలిన మొత్తం రూ.8585.4 కోట్లను బిడ్డింగ్ దక్కించుకున్న ప్రైవేట్ సంస్థ పెట్టుబడి పెట్టి పనులు ప్రారంభించనుంది. మొత్తంగా టెండర్లు దక్కించుకున్న సంస్థ ఎనిమిదేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ ప్రాజెక్టు దక్కించుకున్న మూడేళ్లకే తొలి మార్గంలో ప్రయాణికులకు మెట్రో సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుంది. 30 ఏళ్ల పాటు సదరు నిర్మాణ సంస్థకు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) ద్వారా 30 ఏళ్ల పాటు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ 30 ఏళ్ల పాటు ప్రాజెక్టు నుంచి వచ్చే ఆదాయాన్ని సదరు సంస్థ ఆర్జిస్తుంది. లైట్ మెట్రో పనులు తుదిదశకు వచ్చిన తర్వాత మోడ్రన్ ట్రామ్ కారిడార్‌పై దృష్టి సారించనున్నారు.

కారిడార్	కారిడార్ సెక్షన్	పొడవు (కిమీలలో)	స్టేషన్లు
1	స్టీల్‌ప్లాంట్ గేట్–కొమ్మాది జంక్షన్	34.40	29
2	గురుద్వార నుంచి పాతపోస్టాఫీస్	5.07	06
3	తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు	6.75	07
4	కొమ్మాది నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు	30.67	12

మొదటి దశలో 46.23 కి.మీ.

42 మెట్రో స్టేషన్లతో కూడిన మూడు కారిడార్లను మొదటి దశలో నిర్మించాలని భావిస్తున్నారు. కారిడార్–1లో స్టీల్‌ప్లాంట్ గేట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు 29 స్టేషన్లతో 34.40 కిమీ, కారిడార్–2లో 5.07 కిమీ మేర 6 మెట్రో స్టేషన్లతో గురుద్వార నుంచి పాత పోస్టాఫీస్ వరకూ, కారిడార్–3లో భాగంగా 7 స్టేషన్లతో తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు వరకూ 6.75 కిమీ మేర లైట్‌మెట్రో కారిడార్ పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఇందులో మొట్టమొదటిగా స్టీల్‌ప్లాంట్ నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకూ లైట్‌మెట్రో ట్రాక్ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ కారిడార్ పనులను మూడేళ్లలోపు పూర్తి చేసి మొదటి రైలు నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అనంతరం కారిడార్–4లో కొమ్మాది నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకూ 30.67 కిమీ మేర నిర్మాణం చేయనున్నారు. ఇందులో 12 స్టేషన్లు రాబోతున్నాయి. మొత్తంగా నాలుగు కారిడార్లలో 54 స్టేషన్లు, రెండు డిపోలు ఏర్పాటు చేయనున్నారు.

త్వరలోనే కేంద్రానికి డీపీఆర్



వైజాగ్ మెట్రో ప్రాజెక్టు నిర్మాణంలో తొలి అడుగు పడింది. కేబినెట్ డీపీఆర్‌ను ఆమోదించడం శుభపరిణామం. లైట్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు నాలుగైదురోజుల్లో విడుదలవుతాయి. అనంతరం ఆ జీవో కాపీని జతపరుస్తూ కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్ సమర్పిస్తాం. వీలైనంత త్వరగా ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష. దానికనుగుణంగా అడుగులు పడుతున్నాయి. వ్యత్యాస నిధి (వయబిలిటీ గ్యాప్ ఫండ్) తగ్గిస్తూ... ఎవరైతే బిడ్డింగ్ దాఖలు చేస్తారో వారే వైజాగ్ మెట్రో పనులు దక్కించుకుంటారు. ఏపీ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్షియల్ క్యాపిటల్‌గా, ఐటీ హబ్‌గా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో శివారు ప్రాంతాలు కూడా కోర్ సిటీకి సమానంగా అభివృద్ధి చెందాలంటే మౌలిక సదుపాయాలు అవసరం. రాబోయే 35–40 ఏళ్లలో నగర ట్రాఫిక్ డిమాండ్‌కి అనుగుణంగా డీపీఆర్ సిద్ధం చేశాం.

– యూజేఎం రావు, ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఎండీ

ఇదీ మెట్రో రైలు స్వరూపం..

లైట్ మెట్రో ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం
రూ. 14,309 కోట్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా
రూ. 5723.6 కోట్లు

ప్రైవేట్ నిర్మాణ సంస్థ వాటా
రూ. 8585.4 కోట్లు

తొలి రైలు తిరిగే సమయం
పనులు ప్రారంభించిన **3 ఏళ్లలోపు**

ప్రాజెక్టు పూర్తి చేసేందుకు సమయం
8 ఏళ్లు

ఫేజ్–1లో కారిడార్–1,2,3 నిర్మాణానికి అంచనా వ్యయం
రూ. 9,699 కోట్లు

ఫేజ్–2లో కారిడార్–4 నిర్మాణానికి అంచనా వ్యయం
రూ. 4,610 కోట్లు

ప్రాజెక్టు విస్తీర్ణం
76.90 కిమీ,
54 స్టేషన్లు

న్యూస్‌రీల్

పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్‌కు 21 వినతులు



సిబ్బంది నుంచి వినతులు స్వీకరిస్తున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 21 వినతులు వచ్చాయి. సీపీ స్వయంగా సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో 12 మంది అనకాపల్లి నుంచి నగరానికి బదిలీ చేయమని వినతులు అందించారు. అలాగే పదోన్నతులు, ఇంక్రిమెంట్లు, ఏఆర్ఎస్ఐ కోటా పెంచాలని, అనారోగ్య సమస్యల వల్ల నగరానికి బదిలీ చేయాలని, సరెండర్ డబ్బులు తక్కువగా వచ్చాయని, ఇలా పలు సమస్యలను సిబ్బంది సీపీ దృష్టికి తీసుకువెళ్లారు. వీటిని పరిశీలించిన సీపీ అవసరమైన వాటిని సత్వరమే పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. గత నెలలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు 19 వినతులు రాగా 16 పరిష్కరించినట్లు తెలిపారు. రెండు వినతులు పరిష్కారానికి అవకాశం లేకగా.. ఒకటి పరిష్కర దశలో ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ–1 కె.శ్రీనివాసరావు, డీసీపీ–2 కె.ఆనందరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

38 వాహనాలపై కేసులు



ఎన్ఎస్‌టీఎల్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్‌టీఏ అధికారులు

గోపాలపట్నం: నిబంధనలు పాటించని 38 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు రవాణా ఉప కమిషనర్ రాజారత్నం తెలిపారు. ఎన్ఏడీ జంక్షన్‌లో రవాణాశాఖాధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. జాతీయ రహదారిపై ఎన్ఎస్‌టీఎల్ ప్రధాన గేటు నుంచి వంటిల్లు వైపు రాంగ్ రూట్‌లో వెళ్లే వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఎన్ఏడీ రోటరీ ఫ్లైఓవర్‌పై భారీ వానాలు మాత్రమే వెళ్లాలని, ద్విచక్రవాహనాలు దిగువ రోటరీలోనే వెళ్లాలని డీటీసీ రాజారత్నం తెలిపారు. మోటార్ వాహన తనిఖీ అధికారులు ప్రవీణ్ కుమార్, గణేష్ రెడ్డి, మాధవి, రాజారావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు



రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులతో జాతీయ స్థాయికి ఎంపికైన ఆనందపురం కేజీబీవీ విద్యార్థినులు

విశాఖ విద్య: విశాఖ జిల్లా ఆనందపురం కేజీబీవీ విద్యార్థులు 'థింసా నృత్యప్రదర్శన'లో విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొన్న 15 మంది విద్యార్థినులు గిరిజన సంప్రదాయ థింసా నృత్యప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ మేరకు శుక్రవారం విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ విషయాన్ని ప్రకటించి, సర్టిఫికెట్లు అందజేశారు. బాల్‌రంగ్ –2023 పేరిట మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భోపాల్ గౌతమ్ నగర్‌లో ఈ నెల 21న జరిగే జాతీయ స్థాయి పోటీల్లో మన జిల్లా విద్యార్థినుల థింసా నృత్య ప్రదర్శన ఇవ్వనున్నారు. నృత్య పోటీల్లో పాల్గొన్న 15 మంది విద్యార్థినులతో పాటు వీరికి సహాయకులుగా కేజీబీవీ ప్రత్యేకాధికారి ఖాలేషా బేగంతో పాటు, మరో నలుగురు భోపాల్ వెళ్లే అవకాశం లభించింది. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినులను పలువురు అభినందించారు.

నేడు, రేపు జాతీయ స్థాయి కాన్ఫరెన్స్

విశాఖ విద్య: సిముల్‌కాన్ ఫర్ అసెస్‌మెంట్ ట్రాన్స్‌ఫార్మింగ్ హెల్త్ ప్రొఫెషన్ ఎడ్యుకేషన్ పేరిట విశాఖలో రెండు రోజులు పాటు జాతీయ స్థాయిలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖలోని మెడ్‌టెక్ జోన్ కలామ్ కన్వెన్షన్ సెంటర్ (ప్రగతి మైదాన్)లో శని, ఆదివారం కాన్ఫరెన్స్ జరుగనుంది. దీనికి దేశ వ్యాప్తంగా ఉన్న పలువురు వైద్య, ఫార్మారంగ ప్రతినిధులు హాజరుకానున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం రుషికొండ గీతమ్ యూనివర్సిటీలో ముందస్తు వర్క్‌షాప్ నిర్వహించారు.

'కిరణ్ కృష్ణ' రియల్ మోసం..?

- 1993లో కొన్న ప్లాట్.. ఇప్పటికీ స్థలం చూపించని సంస్థ
- స్థలం చూపించమంటే బెదిరిస్తున్న ఎండీ వల్లభనేని కృష్ణప్రసాద్
- కులం పేరుతో దూషించారంటూ ఆనందపురం పోలీసులకు బాధితుడి ఫిర్యాదు
- సబ్ రిజిస్ట్రార్‌కూ బెదిరింపులు



విశాఖ సిటీ: 1993లో కిరణ్ కృష్ణ రియల్ ఎస్టేట్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నుంచి ప్లాట్ కొనుగోలు చేస్తే.. ఇప్పటికీ స్థలం ఎక్కడుందో చూపించడం లేదని జిల్లెళ్ల రఘు ఆరోపిస్తున్నారు. స్థలం కోసం ఆఫీస్‌కు వెళితే సిబ్బంది సమాధానం చెప్పకుండా తప్పించుకొని తిరుగుతున్నాడని, సంస్థ యజమాని వల్లభనేని కృష్ణప్రసాద్‌కు ఫోన్ చేస్తే కుటుంబాన్ని చంపేస్తానంటూ బెదిరిస్తున్నారంటూ ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాత సీబీఐ జంక్షన్‌లో నివాసముంటున్న జిల్లెళ్ల రఘు 1993, మార్చి 23న కిరణ్ కృష్ణ రియల్ ఎస్టేట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వల్లభనేని కృష్ణప్రసాద్ నుంచి ఆనందపురం మండలం గండిగుండం ప్రాంతంలో సర్వే నంబర్ 183/4, 5, 6 లేఅవుట్‌లో ప్లాట్ నంబర్ 2/40లో 300 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ ప్లాట్ ఎక్కడుందో సంస్థ సిబ్బంది గానీ, ఎండీ గానీ చూపించ లేదు. ప్రభుత్వ ఉద్యోగి అయిన రఘు ఇటీవలే పదవీ విరమణ పొందడంతో ఆ స్థలంలో ఇల్లు కట్టుకోవాలని భావించారు. స్థలం ఎక్కడుందో చూపించాలని కిరణ్‌కృష్ణ కార్యాలయానికి వెళితే సంస్థ సిబ్బంది ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ తప్పించుకున్నారు. రిజిస్ట్రేషన్ హద్దుల్లో తేడాలు ఉన్నాయని, సవరణ చేయాలంటూ 2008లో హద్దుల్లో మార్పులు చేసి రిజిస్ట్రేషన్ చేశారు. కానీ ప్లాట్ మాత్రం చూపించలేదు. ఇప్పటికీ కూడా ఆ స్థలం ఎక్కడుందో తెలియకపోవడం సర్వే నంబర్ ప్రకారం స్థలం వివరాలు తెలుసుకోడానికి ఆనందపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి ఆరా తీశారు. అయితే ప్రైవేటు లేఅవుట్ కావడం, ప్లాట్ నంబర్ ప్రకారం స్థలం ఎక్కడుందో రియల్ ఎస్టేట్ సంస్థ వద్ద వివరాలు ఉండడంతో అక్కడి నుంచి సంస్థ ఎండీ వల్లభనేని కృష్ణప్రసాద్‌కు ఫోన్ చేశారు. ప్లాట్ ఎక్కడ ఉందో చెప్పాలని ప్రశ్నించాడు. దీనిపై కృష్ణప్రసాద్ రెచ్చిపోయాడు. 'నన్నే ప్రశ్నిస్తావా? పెద్దవారికే దిక్కులేదు. నీ దిక్కున్న చోట చెప్పుకో అనడంతో పాటు కులం పేరుతో దూషించారు. అంతేకాకుండా ఇంటికి వచ్చి కుటుంబాన్ని చంపేస్తామంటూ హెచ్చరించారు' అని బాధితుడు రఘు వాపోయాడు. దీంతో మనస్తాపం చెందిన రఘు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఆయన ఆనందపురం సబ్‌రిజిస్ట్రార్‌కు కూడా లేఖ రాశారు. తప్పులు సరిచేసి రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలు ఇప్పించాలని కోరారు. కిరణ్ కృష్ణ సంస్థపై గతంలో కూడా కేసులు నమోదయ్యాయని, చాలా మంది ప్లాట్లు విక్రయించినా స్థలాలను చూపించడం లేదని రఘు ఆరోపిస్తున్నారు.

30 ఏళ్లు పోరాడితే స్థలం చూపించారు..

కిరణ్‌కృష్ణ రియల్ ఎస్టేట్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నుంచి ఆనందపురం మండలం వెల్లంకి గ్రామంలో స్థలాన్ని కొనుగోలు చేసి 30 ఏళ్లు పోరాడితే గానీ తమకు స్థలాన్ని చూపించలేదని మరో బాధితుడు కలివరపు దాలిరాజు పేర్కొన్నారు. వెల్లంకి గ్రామంలో సర్వే నంబర్ 224లో 290 చదరపు గాజాలు కొనుగోలు చేసినప్పటికీ.. సదరు రియల్ ఎస్టేట్ సంస్థ తమకు స్థలాన్ని చూపించలేదని ఆరోపించారు. 30 ఏళ్ల పాటు కార్యాలయం చుట్టూ తిరుగుతూ, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేస్తే గానీ కిరణ్‌కృష్ణ సంస్థ యజమాని తమకు స్థలాన్ని చూపించలేదని వెల్లడించారు. ప్లాట్లు విక్రయించి స్థలాలను చూపించకుండా వేధింపులకు గురి చేస్తున్న ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగం ఎలా చేస్తావో చూస్తా

రఘు ఫిర్యాదు మేరకు ఆనందపురం సబ్ రిజిస్ట్రార్ ఎస్.ఆనంద్‌కుమార్ ఇరుపార్టీలను పిలిపించి మాట్లాడారు. రఘు కిరణ్‌కృష్ణ రియల్ ఎస్టేట్ సంస్థ ఎండీ వల్లభనేని కృష్ణప్రసాద్‌కు ఫోన్ చేసి ఆనందపురం సబ్‌రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆ ఫోన్ సబ్‌రిజిస్ట్రార్‌కు ఇవ్వాలని చెప్పి అతడితో కూడా బెదిరింపు ధోరణితో మాట్లాడారు. అమర్యాదగా, అభ్యంతరకరంగా మాట్లాడడమే కాకుండా ఆనందపురంలో ఉద్యోగం ఎలా చేస్తావో చూస్తానని బెదిరించారు. దీనిపై సబ్‌రిజిస్ట్రార్ ఎస్.ఆనంద్‌కుమార్ కూడా ఎండీ వల్లభనేని కృష్ణప్రసాద్‌పై ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను బెదిరించిన కృష్ణప్రసాద్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, తనకు అతడి నుంచి రక్షణ కల్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పాండ్రంగి వాసుల వంతెన కల సాకారం




పాండ్రంగిలో గోస్తని నదిపై వంతెన నిర్మాణానికి శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- రూ.16.50 కోట్లతో వంతెన నిర్మాణ పనులకు శ్రీకారం
- త్వరలోనే రూ.5 కోట్లతో అనంతుని ఘాట్ రోడ్డు నిర్మాణం

పద్మనాభం: పాండ్రంగి సమీపంలో వంతెన, అనంత పద్మనాభస్వామి ఘాట్ రోడ్డును బీటీరోడ్డుగా అభివృద్ధి చేస్తామని పాదయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఆ హామీని మాట తప్పకుండా నెరవేరుస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. 25 ఏళ్లు పాలించిన టీడీపీ పాలకులు వంతెన నిర్మించకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. ఏడాదిలోగా వంతెన నిర్మిస్తామని.. ఇందుకు ప్రభుత్వ పరంగా అవసరమైన సహకారాన్ని కాంట్రాక్టర్‌కు అందిస్తామన్నారు. పంచాయతీరాజ్ రూరల్ ప్లెయిన్ నిధులు రూ.16.50 కోట్లతో వంతెన నిర్మాణ పనులను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ గోస్తనీపై వంతెన నిర్మించడం వల్ల పాండ్రంగితో పాటు 15 గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అనంత పద్మనాభస్వామి ఘాట్ రోడ్డును రూ.5 కోట్లతో బీటీరోడ్డుగా తీర్చి దిద్దే పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. సామాజిక పింఛన్ రూ.3 వేల పెంపునకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. జనవరిలో డ్వాక్రా మహిళలకు నాల్గో విడత రుణ మాఫీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి రూపంలో పాండ్రంగిలో రూ.52 కోట్లు వెచ్చించామన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ వంతెన నిర్మాణానికి మొదట రూ.14 కోట్లు మంజూరు చేశారన్నారు. ఇవి చాలకపోవడంతో సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లగా.. మరో రూ.2.50 కోట్లు మంజూరు చేశారన్నారు. అనంతుడి ఘాట్ రోడ్డుకు రూ.5 కోట్లు, పద్మనాభం నుంచి రెడ్డిపల్లి శాంతినికేతన్ వరకు రోడ్డు విస్తరించడానికి రూ.10.04 కోట్లు, రేవిడి –ఐనాడ రోడ్డుకు రూ.16కోట్లను సీఎం జగన్ మంజూరు చేసినట్లు వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జన్మించిన పాండ్రంగిలో రూ.2 కోట్లతో మ్యూజియం నిర్మిస్తున్నట్టు తెలిపారు. అనంతరం 249 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. వై.వి.సుబ్బారెడ్డి, ముత్తంశెట్టిలను స్థానిక నాయకులు గజమాలతో సత్కరించారు. మహారాజుపేట జంక్షన్ నుంచి భారీ బైక్ ర్యాలీతో పాండ్రంగి తీసుకొచ్చారు. పాండ్రంగిలో సాంస్కృతిక కార్యక్రమాలతో స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఆర్డీవో భాస్కరరెడ్డి, పద్మనాభం ఎంపీపీ కంటుబోత రాంబాబు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచలి సూర్యనారాయణ, వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ పద్మనాభం అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, పాండ్రంగి సర్పంచ్ పల్లి ఝాన్సీ, ఎంపీటీసీ సభ్యురాలు పిన్నింటి నారాయణమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు అముజూరి అప్పారావు, ఆర్.ఎస్.దేముడుబాబు, పల్లి మహేష్ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిని ప్రజలకు వివరిస్తాం

- నేటి నుంచి 3 రోజుల పాటు పర్యటన
- మీడియాతో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఉత్తరాంధ్రలో అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామని పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మూడు రోజుల పాటు ఉత్తరాంధ్రలో పార్టీ ముఖ్యనేతలు, మంత్రులు పర్యటించి ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ నెల 16న భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును, 17న విజయనగరం మెడికల్ కళాశాల, 18న మూలపేట పోర్టు పనులను పరిశీలించి ప్రజలకు వివరించే వినూత్న కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. శుక్రవారం ఎండాడ లా కాలేజ్ సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమానంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఉత్తరాంధ్రలో పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు హామీలే తప్ప వాటిని నెరవేర్చిన పాపాన పోలేదన్నారు. ఉత్తరాంధ్రలో ప్రాజెక్టులు శంకుస్థాపనలకే పరిమితమయ్యాయన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానం సమస్యకు శాశ్వత పరిష్కారం సీఎం వైఎస్ జగన్ చూపించారన్నారు. ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం హామీ నెరవేర్చారన్నారు. ఉద్దానంలో రూ. 750 కోట్లతో వైఎస్సార్ సుజల ధార ప్రాజెక్టు, రూ.85 కోట్లతో వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ అండ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ ఎస్పీగా హైమావతి

విశాఖ సిటీ: విశాఖ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా డి.హైమావతి నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ ఏఎస్పీగా ఉన్న జి.స్వరూపారాణి తూర్పు గోదావరి జిల్లా లా అండ్ ఆర్డర్ అడిషినల్ ఎస్పీగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా.. విశాఖ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం హోదాను పెంచినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ఇక్కడ ఏఎస్పీ స్థాయి అధికారి విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. తాజాగా ఎస్పీ స్థాయి అధికారిని నియమించారు. బదిలీపై రానున్న డి.హైమావతి ఇప్పటి వరకు నెల్లూరు ఏఎస్పీ(అడ్మిన్)గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమెకు ఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం విశాఖ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ చేసింది.

విశాఖ డీసీపీ(క్రైమ్)గా వెంకటరత్నం

విశాఖ సిటీ: విశాఖ డీసీపీ(క్రైమ్)గా పి.వెంకటరత్నం నియమితులయ్యారు. ఇక్కడ క్రైమ్ డీసీపీగా విధులు నిర్వర్తించిన జి.నాగన్నను ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఖాళీగా ఉన్న ఈ పోస్టులో వెంకటరత్నంను నియమించారు. ప్రస్తుతం ఆమె విజయవాడ క్రైమ్ ఏడీసీపీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఏఎస్పీగా ఉన్న ఈమెకు ఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ విశాఖ డీసీపీ(క్రైమ్)గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

బైజూస్ ట్యాబ్‌పై పిచ్చి రాతలు మానుకోవాలి

- టిష్యూ పేపర్‌గా మారిన ఈనాడు
- రామోజీరావు బుద్ధి తెచ్చుకుని వార్తలు రాయాలి : ఎమ్మెల్యే వాసుపల్లి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: కామం కప్పిన కళ్లతో కాకుండా జర్నలిజంతో రామోజీరావు వార్తలు రాయాలే గానీ.. బైజూస్ ట్యాబ్‌లో పిల్లలు పోర్న్ వీడియోలు చూస్తారని రాయడం సిగ్గుచేటని విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మండిపడ్డారు. పిల్లల విద్య కోసం ఉపయోగపడే బైజూస్ ట్యాబ్‌పై ఈనాడు బురదజల్లే వార్తలు ప్రచురించడాన్ని ఖండించారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వస్తే మనుగడ ఉండదని భావించి.. దుర్మార్గమైన ఆలోచనతో రామోజీరావు పనికిమాలిన రాతలు రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఆ వయసులో ఇలాంటి ఆలోచన ఎలా కలిగిందో తెలియడం లేదన్నారు. కళ్లతో ఏ విధంగా చూస్తే ఆ విధంగానే భావన కలుగుతుందన్నారు. విద్యను బోధించే బైజూస్ ట్యాబ్‌లో పోర్న్ వీడియోలు చూస్తారని పిచ్చి రాతలు రాయడం సిగ్గుచేటన్నారు. ఇటువంటి దిగజారుడు వార్తలు ప్రచురించడం వల్ల ఆ ప్రముఖ పత్రిక నేడు టిష్యూ పేపర్‌గా మారిందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సమస్య ఎదురైనప్పుడు ధైర్యం కోల్పోవద్దు

- చాగంటి కోటేశ్వరరావు


ప్రసంగిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

తగరపువలస: సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యం కోల్పోవద్దని ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. భీమిలి కేథరిన్ విద్యా సంస్థల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విద్యార్థులు–వ్యక్తిత్వ వికాసం అనే కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రముఖులంతా మొదట్లో కష్టాలను ఎదుర్కొని విజయాలు సాధించిన వారేనన్నారు. అబ్దుల్ కలాం, మహాత్మా గాంధీ, నెహ్రూ, టంగుటూరి ప్రకాశం పంతులు, ఘంటసాల వెంకటేశ్వరరావు, పి.సుశీల వంటి మహనీయుల జీవిత విశేషాలు తెలుసుకోవాలన్నారు. పుట్టినరోజు సందర్భంగా వారి చరిత్రను తెలిపే పుస్తకాలు కొనుక్కోవాలన్నారు. క్రమశిక్షణ, ధ్యానం, వికాస విద్య ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. ఎఫ్‌సీఐలో పని చేసి విరమణ చెందిన తనకు ప్రవచనం చెప్పడం హాబీ అన్నారు. నేర్చుకోవాలి అన్న తపనే తనకు హోదా, కీర్తి తెచ్చి పెట్టాయన్నారు. కష్టాలకు బయపడకుండా ఎదురొడ్డి నిలబడాలన్నారు. విద్యార్థులకు సెల్‌ఫోన్‌లు వ్యసనంగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అవసరానికే వీటిని వినియోగించాలన్నారు. గమ్యాన్ని చేరుకోవడానికి, ప్రమాదాల నుంచి బయటపడటానికి వాహనానికి ఎక్సలేటర్, బ్రేకులు ఎంత ముఖ్యమో.. మన జీవితంలో కూడా ఓర్పు, సహనం, లక్ష్యం అవసరమన్నారు. రే–బాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్, లయన్స్ క్లబ్ భీమిలి సెంటీనియల్, సాగర్ అసోషియేషన్ ఆఫ్ వాకర్స్, కేథరిన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలివర్ ఆర్ రాయి, పార్వతీశం, కోట మల్లికార్జునరావు, అక్కరమాని రామునాయుడు, తమ్మిన రామలక్ష్మణ పాల్గొన్నారు.

'దేశీ' ఉత్పత్తులే దివ్యౌషధాలు

- విశాఖ ఆర్గానిక్ మేళాకు విశేష స్పందన
- సేంద్రియ ఉత్పత్తుల కొనుగోలుకు నగర వాసుల ఆసక్తి


స్వచ్ఛమైన నెయ్యి విక్రయిస్తున్న హైదరాబాద్‌కు చెందిన రైతు


విత్తన బ్యాంక్‌లో సిరిధాన్యాల కంకులు


ఇంట్లో అలంకరించే మొక్కలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికగా జరుగుతున్న విశాఖ ఆర్గానిక్ మేళాకు విశేష స్పందన లభిస్తోంది. మేళాలో భాగంగా రెండవ రోజు శుక్రవారం పెద్ద సంఖ్యలో నగర వాసులు స్టాళ్లను సందర్శించి.. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేశారు. ఉదయం 10 గంటల నుంచే స్టాళ్ల వద్ద వినియోగదారుల సందడి కనిపించింది. ఏపీ, తెలంగాణ నుంచి వచ్చిన రైతులు, విక్రేతలు తమ ఉత్పత్తులను విక్రయించారు.

సరికొత్త 'వరి'వడి

నిత్యం మనం తినే బియ్యానికి భిన్నంగా పోషకాలుండే వివిధ దేశీ బియ్యం రకాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. మైసూర్ మల్లిక, కాలబట్టి, కృష్ణవీహి, చిట్టి ముత్యాలు, మాపిళ్లే సాంబ, పుంగార్, నవార, షుగర్ ఫ్రీ రైస్ వంటి రకాలు విక్రయిస్తున్నారు. వీటితో పాటు జొన్న, సజ్జ, రాగితో చేసిన అటుకులు, పప్పులు కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు.

- సిరి ధాన్యాలపై ప్రజలకు అవగాహన పెరగడం, విరివిగా వినియోగించడంతో.. వీటిని ఇక్కడ అందుబాటులో ఉంచారు. మల్టీ మిల్లెట్ పిండి, ఉలవ పిండి, దోశ మిక్స్, గంటి బియ్యం, జొన్న పిండి వంటివి విక్రయిస్తున్నారు.
- హైదరాబాద్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకున్న దేశీ ఆవు నెయ్యితో పాటు స్థానికంగా రైతులు తమ వ్యవసాయ క్షేత్రంలో తయారు చేసిన నెయ్యిని విక్రయిస్తున్నారు. గిరిజన ప్రాంతంలో లభించే తేనె ఇక్కడ అందుబాటులో ఉంది.
- ఆదివాసీ ప్రాంతాల్లో పండించే వివిధ సిరిధాన్యాలు, కూరలు, పప్పుధాన్యాలకు సంబంధించిన స్టాల్ ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. దేశీ కూరగాయల విత్తనాలను పలువురు విక్రయిస్తున్నారు.

దేశీ బియ్యం విక్రయిస్తున్నాం



మా ప్రాంతంలో పలువురు రైతులు సమష్టిగా దేశీ వరి రకాలు సాగు చేస్తున్నాం. సేంద్రియ విధానంలో పండించిన ఈ పంటలను ఇక్కడ విక్రయిస్తున్నాం. విశాఖ ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. కోరిన వారికి ఆర్డర్‌పై పంపిస్తాం.

– సునీల్, విజయవాడ

ప్రోత్సాహం బాగుంది



ఏటా నిర్వహించే ఆర్గానిక్ మేళాలో పాల్గొంటున్నాం. మేము పండించే పంటలను నేరుగా ఇక్కడ విక్రయిస్తున్నాం. ఇక్కడ స్టాళ్లలో కొనుగోలు చేసిన వారు తర్వాత ఫోన్ చేసి మా ఉత్పత్తులు కావాలని అడుగుతుంటారు. తరచూ ఇటువంటి మేళాలు నిర్వహించాలి. – విజయలక్ష్మి, కొత్తవలస

సహకార వ్యవసాయం.. లాభదాయకం


మాట్లాడుతున్న డాక్టర్ రామాంజనేయులు

ఏయూక్యాంపస్: రైతులంతా సమష్టి సహకార పద్ధతిలో వ్యవసాయం చేయాలని అకాడమీ ఫర్ ఆగ్రో ఎకాలజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వి.రామాంజనేయులు కోరారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన ఆర్గానిక్ గ్రాడ్యుయేట్ రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రసాయన వ్యవసాయానికి ఎంత రాయితీ ఇస్తున్నారో.. అంతే రాయితీని ప్రకృతి వ్యవసాయ రైతులకు ఇవ్వాలని ఆయన కోరారు. దీని వలన ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. రైతులకు శాస్త్రీయ అవగాహనకు శిక్షణ అందిస్తున్నామని.. తమ సంస్థ హెల్ప్ లైన్ నంబర్ 85009 83300ను వినియోగించుకోవాలని కోరారు. పంటలో వచ్చే తెగుళ్లను గుర్తించడానికి పెస్టోస్కోప్ యాప్‌ను వినియోగించాలని సూచించారు. ఆగ్రో డీఎస్ఏ వ్యవస్థాపకుడు నరేంద్ర నెల్ల మాట్లాడుతూ తాము పంట భూమిని పరీక్షించి.. దాని ఆధారంగా పంటలకు ఎలాంటి పోషకాలు అందజేస్తున్నామో వివరించారు. వ్యవసాయంలో మార్కెటింగ్ కూడా ప్రధాన అంశమని, టెక్నాలజీ వినియోగించి.. బ్రాండ్ ఇమేజ్ పెంచుకుంటూ పంటను విక్రయించాలన్నారు. గ్రాడ్యుయేట్ రైతు సతీష్ గద్దె మాట్లాడుతూ వ్యవసాయానికి పశువులే ప్రధానమన్నారు. ఏకవార్షిక పంట మంచి ఫలితాలిస్తోందన్నారు. వ్యవసాయానికి అనుబంధంగా పశువుల పెంపకం చేపట్టాలన్నారు. రైతు సాధికారత సంస్థ ప్రతినిధి కె.ప్రభాకర్ మాట్లాడుతూ తమ సంస్థ 3,500 గ్రామాల్లో ప్రకృతి ఆధారిత పంటలు పండించే రైతులకు సహకారం అందిస్తోందన్నారు. గ్రాడ్యుయేట్ రైతుల సమావేశం అధ్యక్షుడు చెరుకూరి రిషి మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ రైతుల సంఖ్య పెరుగుతోందన్నారు. మార్కెటింగ్ విషయంలో చాలా సంస్థలు ముందుకొస్తున్నాయని, ప్రకృతి ఆధారిత పంటలు పండించే రైతులను పెంచుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్ మాధవ్, భారత కిసాన్ సంఘ్ జాతీయ నాయకుడు జలగం కుమారస్వామి, ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర ప్రతినిధి జనార్దన్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పెరి రామకృష్ణ రావు, ఆర్‌వైఎస్ఎస్ ప్రతినిధి కృష్ణారావు, గో–ఆధారిత ప్రకృతి రైతు సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్య వర్మ, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్ కుమార్, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు ఆహ్వానం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుడిమెట్ల రవిరెడ్డి శుక్రవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 20న జరగనున్న తన కుమార్తె వివాహానికి రావాలని కోరుతూ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. – సాక్షి, విశాఖపట్నం

ఎస్సీ, ఎస్టీ జిల్లా స్థాయి అట్రాసిటీ నివారణ కమిటీ నియామకం

విశాఖ సిటీ: విశాఖ డివిజనల్ స్థాయి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నివారణ కమిటీని నియమిస్తూ ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల కాల పరిమితితో ఐదుగురు సభ్యులను నియమించారు. కమిటీలో షీలానగర్ ప్రాంతానికి చెందిన బోనెల యేసుబాబు, గోపాలపట్నానికి చెందిన చేవేటి జీవన్ కుమార్, వడ్లపూడికి చెందిన డి.జనార్దనరావు, పెందుర్తి మండలానికి చెందిన కాకర నూకరాజుతో పాటు ఎస్సీ, ఎస్టీ యేతర కోటా కింద సుజాతనగర్‌కు చెందిన న్యాయవాది గొర్రి వాసుదేవరావు ఉన్నారు.

అపోలోలో ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీలు


మాట్లాడుతున్న అపోలో ఆర్థోపెడిక్ వైద్యులు

ఆరిలోవ: అపోలో ఆస్పత్రిలో యూబీఈ ఎండోస్కోపిక్ సర్జరీ, మినిమల్లి ఇన్వాసివ్ స్పైన్ శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చినట్లు ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ ఎం.సతీష్ తెలిపారు. ఆస్పత్రిలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండోస్కోపిక్ వెన్నెముక సర్జరీలో వేగవంతమైన రికవరీ ఉంటుందన్నారు. కండరాలు నష్టం లేకుండా, కుట్టు లేని పద్ధతి అవలంబిస్తూ.. అతి తక్కువ రక్తస్రావంతో ఈ శస్త్రచికిత్స చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 17న ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు యూబీఈ ఎండోస్కోపిక్ వెన్నెముక శస్త్ర చికిత్సపై ఉచిత అవగాహన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో వెన్నెముక వ్యాధుల పట్ల కూడా అవగాహన కల్పిస్తామన్నారు. ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ సతీష్ రాజు, డాక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

త్యాగమూర్తి.. పొట్టి శ్రీరాములు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీ రవిశంకర్, జేసీ విశ్వనాథన్

డాబాగార్డెన్స్: ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం శుక్రవారం జీవీఎంసీలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్‌వర్మ, స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఉరుకూటి నారాయణరావు, పలువురు అధికారులతో కలిసి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదనపు కమిషనర్లు డాక్టర్ వై. శ్రీనివాసరావు, ఎస్ఎస్ వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావు, కార్యదర్శి పి.నల్లనయ్య, జోనల్ కమిషనర్లు బి.రాము, విజయలక్ష్మి, డీసీఆర్ ఎంవీడీ ఫణిరామ్, యూసీడీ పీడీ పాపునాయుడు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జీవితం.. ఆదర్శప్రాయం

విశాఖ సిటీ: అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా నగర పోలీస్ కమిషనరేట్‌లో ఆయన చిత్ర పటానికి సీపీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్రం కోసం తనను తాను బలిదానం చేసుకున్న గొప్ప త్యాగమూర్తి పొట్టిశ్రీరాములు అని కొనియాడారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. డీసీపీ–2 కె.ఆనందరెడ్డి, ఏడీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీక

విశాఖ సిటీ: తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీక అమరజీవి పొట్టి శ్రీరాములు అని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా జేసీ పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాము లు తన ప్రాణ త్యాగంతో ప్రత్యేక తెలుగు రాష్ట్రం ఏర్పడేలా చేసి.. అమరజీవిగా నిలిచారన్నారు. డీఆర్వో కె.మోహన్ కుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకుడు వి.మణిరామ్, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి కె.వి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

పుస్తకానికి ఏ మాత్రం ఆదరణ తగ్గలేదు


పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాఖ సిటీ: టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా పుస్తకానికి ప్రాధాన్యం ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. విశాఖలో జరుగుతున్న విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తక ప్రదర్శనకు వస్తున్న స్పందనను బట్టి పుస్తకాలకు ఏ మాత్రం ఆదరణ తగ్గలేదని అర్థమవుతోందన్నారు. ఇంటర్నెట్, సెల్‌ఫోన్.. ఎన్ని వచ్చినా అనేక మంది పుస్తకాలను చదువుతున్నారని చెప్పారు. ఏటా క్రమం తప్పకుండా పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్న విశాలాంధ్ర బుక్ హౌస్, విశాలాంధ్ర విజ్ఞాన సమితిని అభినందించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, జీవీఎంసీ సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు అచ్యుతరావు, సి.ఎన్. క్షేత్ర పాల్, చంద్రశేఖర్, అరసం కార్యదర్శి అప్పలరాజు పాల్గొన్నారు.

ఘనంగా సద్గురు యోగానంద శత జయంతి


కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

భీమునిపట్నం: భీమిలికి చెందిన సద్గురు యోగానంద శత జయంతి ఉత్సవం గురువారం రాత్రి చిన్నబజార్‌లోని శ్రీ కృష్ణ కూచిపూడి నృత్య నిలయంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శివానంద మాట్లాడుతూ యోగానంద ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగేవని గుర్తు చేసుకున్నారు. ఆయన అందించిన ప్రవచనాలు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచాయన్నారు. నృత్య నిలయం వ్యవస్థాపక శిక్షకురాలు కృష్ణవేణి మాట్లాడుతూ ఆయన అందించిన బోధనలు తనపై చాలా ప్రభావం చూపాయని. ఈ శత జయంతి ఉత్సవం తన చేతులమీదుగా నిర్వహించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నృత్య నిలయం విద్యార్థినులు కూచిపూడి నృత్యార్చనతో యోగానందకు ఘనంగా నివాళులర్పించారు.

ఇంట్లో చెప్పకుండా హైదరాబాద్ వెళ్లేందుకు విద్యార్థినుల ప్రయత్నం

- సకాలంలో స్పందించి ఎన్ఏడీలో పట్టుకున్న పోలీసులు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

గోపాలపట్నం: కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న ఆరుగురు విద్యార్థినులు ఇంట్లో చెప్పకుండా హైదరాబాద్ వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు వారిని పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివీ.. గోపాలపట్నం, ఎన్ఏడీ ప్రాంతాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్నారు. ఈ నెల 13న స్కూల్ విడిచిపెట్టిన తర్వాత ఇంటికి వెళ్లకుండా.. నగరానికి వచ్చారు. ఆర్.కె.బీచ్‌లో కొద్దిసేపు గడిపి.. ఆర్టీసీకి కాంప్లెక్స్‌కి చేరుకున్నారు. కాంప్లెక్స్‌లో హైదరాబాద్ వెళ్లేందుకు టికెట్లు తీసుకొని బస్సు ఎక్కారు. అయితే సకాలంలో పిల్లల రాకపోవడంతో తల్లిదండ్రులు పాఠశాలకు ఫోన్ చేసి వాకబు చేశారు. బాలికలు పాఠశాల నుంచి వెళ్లిపోయారని ఉపాధ్యాయులు చెప్పడంతో.. వెంటనే ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన పోలీసులు నగరంలో పలు ప్రాంతాల్లో గాలించారు. ఎన్ఏడీ జంక్షన్‌లో బస్సులను తనిఖీ చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్ వెళ్లే బస్సులో విద్యార్థినులను గుర్తించి.. స్టేషన్‌కు తరలించారు. వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి.. అందరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు.

గతంలో ఉప్పల్ కేంద్రీయ విద్యాలయంలో స్కూల్ గేమ్స్‌లో పాల్గొన్నామని.. మరో సారి ఉప్పల్‌కు బయలుదేరినట్లు విద్యార్థులు చెబుతున్నారు. ఓ బాలిక వద్ద డబ్బులు ఉన్నాయి. ఆమె బస్సు టికెట్లు కొనుగోలు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. వీరు ఎందుకు ఉప్పల్ బయలుదేరారనే అంశంపై దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థుల విషయంపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు.